
చిన్నవంగలిలో కూలిన మట్టి మిద్దె

కూలిన బతుకులు

- చాగలమర్రి మండలంలో ఘోర విషాదం
- మట్టిమిద్దె కూలి నలుగురు దుర్మరణం


చిన్నవంగలిలో మట్టి మిద్దె కూలి మృతి చెందిన దంపతులు, కూతుర్లు

విధి వారిని వెంటాడింది. మట్టి మిద్దె రూపంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగుర్ని మింగేసింది. గురువారం అర్ధరాత్రి ఈ విషాద ఘటన జరిగింది. ఉదయం నిద్రలేచి చూసిన గ్రామస్థులను ఈ ఘటన తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఒకేసారి తల్లిదండ్రులు, ఇద్దరు కూతుళ్ల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోవడం ప్రతి ఒక్కరి హృదయం చలించిపోయింది. అనాథగా మారిన గురుశేఖర్‌రెడ్డి రెండో కుమార్తె 'నాకు దిక్కెవరంటూ' రోదిస్తున్న తీరును చూసి ప్రతి ఒక్కరూ కన్నీరుగార్చారు.

చిన్నవంగలిలో మృతదేహాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ


వివరాలు 7లో..


ఈర్లదిన్నె రీచ్ వద్ద తుంగభద్రలో తవ్వేసి నది ఒడ్డున నిల్వ చేసిన ఇసుక (ఫైల్)

ఇసుక బొక్కేశారు

- జేపీ వెంచర్స్, ప్రతిమ సంస్థలపై కేసులు నమోదు
- అపరాధ రుసుం రూ.59 కోట్ల పైమాటే
- ఎట్టకేలకు మేలుకున్న అధికారులు
- నాగలదిన్నె, గుడికంబాలి, మరళి రీచ్‌ల్లో 2.98 లక్షల టన్నుల అక్రమ తవ్వకాలు

కర్నూలు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):

తుంగభద్ర నదిని అడ్డంగా తవ్వేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారం మాటున కాంట్రాక్ట్ సంస్థలు, స్థానిక వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుకను దోచేశారు. ఎట్టకేలకు మైనింగ్ అధికారులు మేలుకున్నారు. పర్యావరణ అనుమతులు, కన్సెంట్ ఆఫ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీఎఫ్ఈ), కన్సెంట్ ఆఫ్ ఆపరేషన్స్ (సీఎఫ్ఓ), ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) నుంచి ఎన్‌వోసీ లేకుండానే తవ్వకాలు జరపడమే కాకుండా.. ఏకంగా 2.98 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అక్రమంగా తవ్వేసి రవాణా చేసినట్లు అధికారులు తనిఖీల్లో గుర్తించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రూ.59 కోట్ల అపరాధ రుసుం విధించే అవకాశం ఉంది. అలాగే.. టీడీపీ ప్రభుత్వం వచ్చాక నూతన ఇసుక పాలసీ విధానం అమల్లోకి తెచ్చింది. గత జగన్ ప్రభుత్వంలో ఇసుక కాంట్రాక్ట్ తీసుకున్న జేపీ వెంచర్స్, ప్రతిమ సంస్థలపై మైనింగ్ అధికారులు కేసులు కూడా నమోదు చేశారు. ఆ వివరాలు పరిశీలిస్తే..

తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలు, రవాణా కోసం కౌతాళం మండలం గుడికంబాలి-1,2,3, మరళి-1,2, నందవరం మండలం నాగులదిన్నె-1 ఓపన్ రీచులు, సి. బెళగల్ మండలం కొత్తకోట, కె. సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల వద్ద మరో నాలుగు డీసిల్టేషన్ రీచులు (నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు) గనులు భూగర్భ వనరుల శాఖ గుర్తించారు. ఇసుక తవ్వకాలు, రవాణా కోసం గత జగన్ ప్రభుత్వం జేపీ పవర్ సంస్థకు రెండేళ్ల లీజు అనుమతులు ఇచ్చింది. లీజు గడువు ముగిసినా అక్రమ తవ్వకాలు సాగించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ తరువాత ప్రతిమ సంస్థ లీజుకు తీసుకుంది. అయితే.. అధికారం అడ్డం పెట్టుకొని లీజు ముసుగులో లీజు సంస్థలు, వైసీపీ నాయకులు కుమ్మక్కై తుంగభద్రను అడ్డంగా తవ్వేసి ఇసుకను అక్రమ రవాణా చేశారనే ఆరోపణలు అప్పట్లోనే వెల్లువెత్తాయి. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని జాతీయ హరిత ట్రైబ్యూనల్ (ఎన్‌జీటీ) 2023 జూన్ 2న ఆదేశాలు జారీ చేసినా.. ఆ ఆదేశాలను పట్టించుకోకుండా ఇసుక తవ్వకాలు సాగించారు. అంతేకాదు.. పర్యావరణ అనుమతులు (ఈసీ)తో పాటు భారత ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) నుంచి ఎన్‌వోసీ లేకుండా రీచ్‌లలో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలు, ఇసుక అక్రమ తవ్వకాలపై పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన అప్పటి కలెక్టరు జి. సృజన ఆదేశాల మేరకు ఆదోని సబ్ కలెక్టరు నారాయణస్వామి, మైనింగ్ డీడీ రాజశేఖర్ నేతృత్వంతో మైనింగ్, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా ఆయా ఇసుక రీచ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్రమ తవ్వకాలు వాస్తవమేనని నిగ్గుతేల్చి ఈ ఏడాది ఫిబ్రవరి 13న నివేదిక ఇచ్చారు. ఆ తరువాత మైనింగ్ విజిలెన్స్ అధికారులు కూడా ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారు.


తవ్వేసిన ఇసుకను నది ఒడ్డున నిల్వ (ఫైల్)



ప్రజాభిప్రాయ సేకరణకు సన్నాహాలు

తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలకు కౌతాళం మండలం నదిచాగి గ్రామం వద్ద సర్వే నంబరు 240లో నదిచాగి రీచ్ 9.17 హెక్టార్లు, మరళి గ్రామం వద్ద సర్వే నంబరు 157లో 3.11 హెక్టార్లు మరళి-2 రీచ్, గుడికంబాలి గ్రామం సర్వే నంబరు 288లో 10.9 హెక్టార్లలో గుడికంబాలి రీచ్‌లను గుర్తించారు. పర్యావరణ అనుమతులు, కాన్సెంట్ ఆఫ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీఎఫ్ఈ), కన్సెంట్ ఆఫ్ ఆపరేషన్స్ (సీఎఫ్ఓ) కోసం ఆగస్టు 31న ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు.

2.98 లక్షల టన్నుల ఇసుక దోచేశారు

నాగులదిన్నె, గుడికంబాలి, మరళి ఇసుకు రీచ్‌ల్లో గత ప్రభుత్వంలో లీజు అనుమతులు తీసుకున్న జేపీ పవర్, ప్రతిమ సంస్థలు లీజు ముసుగులో ఇష్టారాజ్యంగా అక్రమ తవ్వకాలు సాగించారు. ఏకంగా 2.98 లక్షల మెట్రిక్ టన్నులు అక్రమంగా తవ్వి రవాణా చేసినట్లు మైనింగ్ అధికారులు గుర్తించారు. వైసీపీ ప్రభుత్వంలో గత మూడు నాలుగేళ్లలో ఇంతకు పదిరెట్లకు పైగానే అక్రమ రవాణా చేసి ఉంటారనే ఆరోపణలు లేకపోలేదు. నందవరం మండలం నాగులదిన్నె వద్ద తుంగభద్ర నదిలోని రీచ్‌లో ప్రతిమ సంస్థ 48 వేలు మెట్రిక్ టన్నుల ఇసుక అక్రమంగా తవ్వి రవాణా చేశారని మైనింగ్ అధికారులు ఆ సంస్థకు నోటీసులు జారీ చేశారు. అపరాధ రుసుం రూ.9 కోట్లు చెల్లించాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. అంతేకాదు.. ఆర్‌ఆర్ యాక్ట్ నోటీసులు కూడా జారీ చేశారు. అలాగే.. మరళి, గుడికంబాలి రీచ్‌ల్లో 2.50 లక్షలు మెట్రిక్ టన్నులు ఇసుక అక్రమంగా తవ్వినట్లు నిర్ధారించారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం టన్నుకు రూ.2 వేలు ప్రకారం రూ.50 కోట్లు అపరాధ రుసుం (పెనాల్టీ) విధించే అవకాశం ఉంది. ఇసుక అక్రమ తవ్వకాలు సాగించిన జేపీ పవర్, ప్రతిమ సంస్థలకు నోటీసులు జారీ చేయడమే కాకుండా.. కౌతాళం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చివర్లో విచారిస్తే కేవలం మూడు రీచ్‌ల్లో సాగించి అక్రమ తవ్వకాలు ఈ స్థాయిలో ఉంటే మూడు నాలుగేళ్లుగా ఏ స్థాయిలో అక్రమ తవ్వకాలు చేసి ఉంటారో ఇట్టే తెలుస్తుందని టీడీపీ నాయకులు అంటున్నారు. అంతేకాదు.. సి. బెళగల్ మండలం కొత్తకోట, కె. సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల వద్ద డీసిల్టేషన్ రీచ్‌ల్లో కూడా భారీ ఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు సాగించారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇసుక ఇబ్బందులు తీర్చేలా..

గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా ఒక్కటే కాదు.. కృత్రిక కొరత సృష్టించి వినియోగదారుల నుంచి నిలువునా దోచుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక కష్టాలు తీర్చేలా నూతన ఇసుక పాలసీ-2024 విధానం అమల్లోకి తెచ్చింది. ఎక్స్‌కలేషన్, లోడింగ్, సీనరేజ్ (రాయల్టీ, డీఎంఎఫ్, మెరిట్), అడ్మినిస్ట్రేషన్ చార్జీలు, జీఎస్‌టీ కలపి టన్నుకు రూ.335 ధర నిర్ణయించాం. రాయల్టీ మొత్తం కూడా స్థానిక సంస్థలు ఆర్థిక బలోపేతం, అభివృద్ధి కోసం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల ఖాతాకు జమ చేస్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో టన్ను రూ.675 ఉండేది. నూతన విధానం వల్ల టన్నుకు రూ.340 ఆదా అవుతుంది. అయితే.. పూర్తి స్థాయిలో ఇసుక రీచ్‌లో ప్రారంభం కాకపోవడంతో ఇసుక రవాణాదారులు కృత్రిమ కొరత సృష్టించి ఇష్టారాజ్యంగా అమ్మకాలు చేస్తున్నారు. ఫలితంగా టీడీపీ ప్రభుత్వం తగ్గించి ఇసుక ధర ఫలాలు భవన నిర్మాణదారులకు అందడం లేదు. అంతేకాకుండా.. మరళి, గుడికంబాలి రీచ్‌లో కొందరు అక్రమ వసుళ్లకు తెర తీయడం వల్ల కూడా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.

నోటీసులు జారీ చేశాం

గతంలో ఇసుక తవ్వకాల కోసం లీజు తీసుకున్న ప్రతిమ సంస్థ నాగులదిన్నె రీచ్‌లో 48 వేల మెట్రిక్ టన్నులు, మరళి, గుడికంబాలి రీచ్‌ల్లో జేపీ పవర్, ప్రతిమ సంస్థలు 2.50 లక్షల టన్నుల ఇసుక అక్రమంగా తవ్వి రవాణా చేసినట్లు గుర్తించి నోటీసులు జారీ చేశాం. మరళి, గుడికంబాలి రీచ్‌ల్లో అక్రమ తవ్వకాలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు. నాగులదిన్నె రీచ్‌లో అక్రమ తవ్వకాలు చేసిన ప్రతిమ సంస్థకు రూ.9 కోట్లు పెనాల్టీ వేసి.. ఆ మొత్తం వసులు చేసేందుకు ఆర్‌ఆర్ యాక్ట్ కింద నోటీసులు కూడా జారీ చేశాం. ప్రస్తుతం నదిచాగి, మరళి-2, గుడికంబాలి రీచ్‌ల్లో పర్యావరణ అనుమతుల కోసం ఆగస్టు 31న ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నాం.

- రాజశేఖర్, మైనింగ్ డీడీ, కర్నూలు


కౌతాళం మండలం మరళి-2 ఇసుక రీచ్‌కు సమీపంలో పరిశీలించి సీజ్ చేసిన అధికారులు బృందం (ఫైల్)

ఓర్వకల్లు విమానాశ్రయంలో నైట్ ల్యాండింగ్‌కు ప్రతిపాదనలు

కలెక్టర్ పి. రంజిత్ బాషా


విమానాశ్రయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా

ఓర్వకల్లు, ఆగస్టు 2: ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో రన్‌వే, ఎక్స్‌టెన్షన్, విమానాలు రాత్రి సమయంలో ల్యాండ్ అయ్యేందుకు వీలుగా రన్‌వేలో కల్పించాల్సిన సౌకర్యాలు, కావాల్సిన నిధులు వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఎయిర్‌పోర్టులోని డైరెక్టర్ చాంబర్‌లో రన్‌వే, ఎక్స్‌టెన్షన్, నైట్ ల్యాండింగ్, ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ అంశాలపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్, ఇండస్ట్రియల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టును పరిశీలించి రన్‌వే, ఎక్స్‌టెన్షన్ ఎక్కడ నుంచి ఎంత వరకు కావాలి.. ఏ లోకేషన్‌లో కావాలనే వివరాలను ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ భూసేకరణ, అప్రోచ్ రోడ్డు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. మెగా ఇండస్ట్రీరియల్ హబ్ అంశాలపై సంబందించిన మ్యాప్‌ను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలిస్తూ అందుకు సంబందించిన వివరాలను జోనల్ మేనేజర్‌ను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రీరియల్ హబ్‌కు ప్రత్యామ్నాయ అప్రోచ్ రోడ్డు ఏర్పాట్లు, భూసేకరణపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలో సమస్యలు పరిష్కరించాలి

ఏపీ విద్యుత్ నియంత్రణ సంస్థ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 2: విద్యుత్ సంస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఏపీ విద్యుత్ నియంత్రణ సంస్థ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి సూచించారు. శుక్రవారం దిన్నెదేవరపాడు సమీపంలోని ఏపీఈఆర్‌సీ నూతన భవనంలో దక్షిణాది రాష్ట్రాల ఏపీఈఆర్‌సీ పరిధిలోని ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ డిస్కంలు, సబ్‌స్టేషన్ల పనితీరు, వాటి నిర్వహణ, తనిఖీలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో తలెత్తే సాంకేతిక సమస్యలను ఏపీఈఆర్‌సీ దృష్టికి తీసుకొస్తూ సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. మార్చి 2025 నాటికి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు, స్మార్ట్ ప్రీపేమెంట్ అంశాలపై అధ్యయనం, పరిశీలన చేయాలని తెలిపారు. తదుపరి సమావేశాన్ని మరో ఆరు నెలల్లో తమిళనాడులో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాల ఈఆర్‌సీ ఉన్నతాధికారులు ఎం.చంద్రశేఖర్, టి.రంగారావు, బండారు కృష్ణయ్య, ఎం.డి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఏవో పోస్టుకు పైరవీలు

- రూ.లక్షల్లో మామూళ్లు ఇచ్చుకునేందుకు సిద్ధమైన ఏవోలు
- జిల్లా కేంద్రంలో పని చేసే ఏవోల మధ్య పోటా పోటీ
- మంత్రులు, ఎమ్మెల్యేల ఆశీస్సుల కోసం పడిగాపులు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 2: విజిలెన్స్ శాఖలో అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టును దక్కించుకునేందు కోసం జిల్లా కేంద్రంలోనే పని చేస్తున్న కొంత మంది ఏవోలు పెద్ద ఎత్తున పైరవీలు చేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీని కోసం రూ.లక్షలు ముట్టజెప్పేందు కోసం సిద్ధమైనట్లు తెలుస్తోంది. విజిలెన్స్ శాఖలో ఏవో పోస్టు దక్కించుకుంటే ఒక్క ఏడాదికే రూ.లక్షలు సంపాదించుకోవచ్చన్న అంచనాలు వీరికి ఉన్నట్లు సహచర అధికారులు గుసగుసలాడుతున్నారు. ప్రధానంగా ఇద్దరు ఏవోలు ఈ పోస్టును దక్కించుకునేందు కోసం తమకు తెలిసిన దారుల్లో మంత్రులు, ఎమ్మెల్యేల ఆశీర్వాదం కోసం గుట్టుచప్పుడు కాకుండా ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిసింది.

భారీ డిమాండ్

జిల్లాలో ఎరువులు, విత్తనాల తయారీ, అమ్మకాలు చేసే వ్యాపారులు, డీలర్ల నుంచి విజిలెన్స్‌లో పని చేసే ఏవోలకు పెద్ద ఎత్తున ముడుపులు గత కొన్నేళ్లుగా అందుతున్నట్లు సమాచారం ఉంది. అందువల్ల విజిలెన్స్ శాఖలో అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏవో) పోస్టుకు భారీ డిమాండ్ ఉంది. ఈ జిల్లాలో తయారవుతున్న నాసిరకం ఎరువులు విత్తనాలు, పురుగు మందులు మొదలైన వాటిపై నిఘా ఉంచి ఆ కంపెనీల డీలర్లను, వ్యాపారులను నిరోధించే బాధ్యత విజిలెన్స్ ఏవోకే ఉంటుంది. కల్లూరు ఇండస్ట్రియల్ ఏరియాతో పాటు కల్లూరు మండలంలోని గోదాములు, నాసిరకం విత్తనాలు, ఎరువులు తయారు చేసే కేంద్రాల సమాచారం తెలుసుకుని గతంలో విజిలెన్స్ శాఖలో పని చేసే ఏవోలు పెద్ద ఎత్తున సంపాదన కూడబెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నతాధికారులకు చేరాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే పెద్ద ఎత్తున నాసిరకం ఎరువులు, నాసిరకం విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఏ మాత్రం అనుమతులు లేని బయో మందులు పక్క రాష్ట్రాల నుంచి ఇక్కడకు చేరవేసి అమాయక రైతులకు అంటగట్టే వ్యాపారులు, దళారులు, డీలర్లు జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్నారు. ప్రతి ఏటా వీరి సంఖ్య పెరుగుతూనే ఉంది. అయితే.. వీరి అక్రమాలను అడ్డుకట్ట వేసేందుకు వ్యవసాయ అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. గతంలో జిల్లా కేంద్రంలో ఎరువులు, పురుగు మందులు, నాసిరకం విత్తనాలను నిరోధించేందు కోసం ఒకే మండల వ్యవసాయాధికారికి అధికారం ఉండేది. అయితే.. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక ఎమ్మెల్యేను ఆశ్రయించి ఒక మండల వ్యవసాయాధికారి మొత్తం కర్నూలు, కల్లూరు మండలాల అధికార పరిధిని విభజించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు సహచర ఏవోలు చర్చించుకుంటున్నారు. కొంత మంది ఏవోలు జిల్లాలో ఎరువుల తయారీ, నాసిరకం విత్తనాల విక్రయాలు చేపట్టే డీలర్లు, యజమానులపై నిఘా పెట్టి పెద్ద ఎత్తున ముడుపులు లాక్కునేందు కోసం భారీ ఎత్తున పైరవీలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరి పేరాశకు భయపడి కొంత మంది విత్తన తయారీదారులు పక్క రాష్ట్రాలకు తమ స్థావరాలను మార్చేశారు.



పెద్దఎత్తున పైరవీలు

ఎలాగూ తమకు బదిలీ తప్పదని ముందే అంచనా వేసుకున్న జిల్లా కేంద్రంలోని కొంత మంది మండల వ్యవసాయాధికారులు విజిలెన్స్ శాఖలో అత్యంత ప్రాధాన్యత ఉన్న విజిలెన్స్ ఏవో పోస్టును దక్కించుకునేందుకు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగా రూ.లక్షల్లో ముడుపులు ఇచ్చుకునేందుకు వీరు ఏ మాత్రం వెనుకడుగు వేయడం లేదని, ఇందులో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేల ఆశీస్సులు పొందేందు కోసం పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

శాశ్వత నిద్ర



మృతి చెందిన భార్య, భర్తలు గురుశేఖర్‌రెడ్డి, దస్తగిరమ్మ


మృతి చెందిన అక్కా చెల్లెలు పవిత్ర, గురులక్ష్మి

- చిన్నవంగలిలో ఘోరం ● అర్ధరాత్రి కూలిన మట్టి మిద్దె
- నిద్రలోనే నలుగురి దుర్మరణం ● వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు.. ● అనాథగా మారిన రెండో కుమార్తె ● నాకు దిక్కెవరంటూ కన్నీటి పర్యంతం


గురుశేఖర్‌రెడ్డి (ఫైల్) | దస్తగిరమ్మ (ఫైల్) | పవిత్ర (ఫైల్) | గురులక్ష్మి (ఫైల్)

చాగలమర్రి, ఆగస్టు 2: చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందారు. గ్రామానికి చెందిన తల్లపురెడ్డి గురుశేఖర్‌రెడ్డి (45), భార్య దస్తగిరమ్మ (38), పెద్దకూతురు పవిత్ర (16), చిన్న కూతురు గురులక్ష్మి (10)లు నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి మట్టి మిద్దె ఒక్కసారిగా కుప్పకూలింది. అర్ధరాత్రి కావడంతో ఎవరూ గమనించ లేదు. తెల్లవారు జామున గ్రామస్థులు గమనించి దిగ్భ్రాంతికి గురయ్యారు. మట్టి కుప్పలను నడుమ కూరుకపోయిన మృతదేహాలను వెలికి తీశారు. మట్టి మిద్దె కావడం, వర్షాలకు బాగా తడిచి దంతెలు దెబ్బతిని ఉండటంతో ఈ ఘోరం జరిగినట్లు తెలుస్తోంది. ప్రొద్దుటూరులోని ఉషోదయ పాఠశాలలో చదువుకుంటున్న గురుశేఖర్‌రెడ్డి, దస్తగిరమ్మల రెండో కుమార్తె ప్రసన్న గ్రామానికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించి సొమ్మసిల్లి పడిపోయింది. బంధువులు ప్రసన్నను ఓదార్చారు. మృతదేహాల వద్ద బంధువులు, గ్రామస్థు రోదనలతో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు

ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ రమణయ్య, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కూలిన మట్టి మిద్దెను పరిశీలించారు. జరిగిన సంఘటన గురించి బంధువులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాలను ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ రమణయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాకు దిక్కెవరు..



చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో మట్టిమిద్దె కూలి తల్లిదండ్రులు, అక్కా, చెల్లెళ్లు మృతి చెందడంతో 'నాకు దిక్కెవరంటూ' ప్రసన్న విలపించడానికి చూసిన ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. రాత్రి తనకు ఫోన్ చేసి ఉదయానికే విగతజీవులుగా మారిన కుటుంబ సభ్యులను చూసి సొమ్మసిల్లి పడిపోయింది. అస్వస్థతకు గురి కావడంతో ప్రసన్నను వైద్యశాలకు తరలించారు.

నలుగురి మృతి బాధాకరం
- ఆర్డీవో మల్లికార్జున రెడ్డి

మండలంలోని చిన్నవంగలి గ్రామంలో మట్టిమిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం దురదృష్టకరమని నంద్యాల ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిమిత్తం తీసుకెళ్లిన మృతదేహాలను పరిశీలించారు. వారి బంధువులతో మాట్లాడారు. జరిగిన సంఘటన గురించి విచారించారు. వర్షాకాలం మట్టిమిద్దెల్లో ఉండరాదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మృతుల కుటుంబానికి ప్రభుత్వపరంగా సాయం అందించి అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ విజయ్‌కుమార్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లికార్జునరెడ్డి

ప్రసన్న బాధ్యత నాది
- నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



మండలంలోని చిన్నవంగలి గ్రామంలో మట్టి మిద్దె కూలి గ్రామానికి చెందిన గురుశేఖర్‌రెడ్డి, దస్తగిరమ్మ, పవిత్ర, గురులక్ష్మి మృతి చెందడం బాధాకరమని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందారన్న విషయం తెలుసుకున్న ఆమె స్పందించి ఫోన్ ద్వారా మృతుల కుటుంబానికి సంతాపం ప్రకటించారు. ప్రసన్న చదువు బాధ్యత పూర్తిగా తాను తీసుకుంటానని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

వ్యవసాయంతో జీవనం..

గురుశేఖర్‌రెడ్డి, దస్తగిరమ్మలు వ్యవసాయ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మొదటి కూతురు పవిత్ర పదో తరగతి చదివింది. రెండో కూతురు ప్రసన్న ప్రొద్దుటూరు ఉషోదయ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. మూడో కూతురు గురులక్ష్మి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. గురుశేఖర్‌రెడ్డికి గ్రామంలో సొంత ఇల్లు ఉన్నా తల్లితో విభేదించి బయటకు వచ్చాడు. ఏడాది కాలం నుంచి బంధువుల మట్టి మిద్దెలో భార్యా పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు.


చిన్నవంగలిలో కూలిన మట్టిమిద్దె

మట్టి మిద్దెల గుర్తింపునకు సర్వే


చిన్నవంగలిలో మట్టిమిద్దెలను పరిశీలిస్తున్న డీపీవో, డీఎల్పీవో

జిల్లాలోని ఆయా గ్రామాల్లో మట్టి మిద్దెల గుర్తింపుకు సర్వే నిర్వహిస్తున్నట్లు డీపీవో మంజులవాణి తెలిపారు. ఒకే కుటుంబంలో నలుగురు మృతి విషయం తెలుసుకున్న ఆమె శుక్రవారం చిన్నవంగలి గ్రామాన్ని సందర్శించి కూలిన మట్టి మిద్దెను పరిశీలించారు. జరిగిన సంఘటన గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని మట్టివి ఎద్దెలను పరిశీలించారు. గ్రామంలో ఉన్న మట్టిమిద్దెలను సర్వే చేసి నివేదికలను తయారు చేయాలని గ్రామ కార్యదర్శులకు ఆదేశించారు. ఆమె వెంట డీఎల్పీవో రాంబాబు, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఎంఈవో అనూరాధ, కార్యదర్శులు నాగార్జున, వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అనిల్‌కుమార్ ఉన్నారు.

రూ.5 లక్షల పరిహారం అందిస్తాం
ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



చాగలమర్రి: మండలంలోని చిన్నవంగలి గ్రామంలో నలుగురు మృతి చెందిన విషయం పట్ల ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పందించారు. శుక్రవారం ఫోన్ ద్వార ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉండి ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల వరకు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రసన్న ఉన్నత చదువుల కోసం పార్టీ తరపున ఆదుకుంటామని అన్నారు.


చిన్నవంగలిలో కూలిన మట్టిమిద్దెను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

ఉపాధ్యాయుల మధ్య ఘర్షణ

- హెచ్ఎంపై చెప్పుతో దాడికి యత్నించిన టీచర్
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- సంఘాల జోక్యంతో క్షమాపణ చెప్పిన ఉపాధ్యాయుడు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 2: ఆదోని పురపాలక పరిధిలోని ఓ ప్రధాన ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడికి, ప్రధానోపాధ్యాయుడికి మధ్య జరిగి ఘర్షణ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం ఉదయం పక్క పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు మరో ఉన్నత పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడిని సర్వీస్ రిజిస్టర్‌లో మరో ఉపాధ్యాయుడి వివరాలు సక్రమంగా రాయలేదని నిలదీశాడు. సర్వీస్ రిజిస్టర్‌లో తాను రాయలేదని, అలాంటిదేమైనా ఉంటే సవరిస్తానని ప్రధానోపాధ్యాయుడు సమాధానమిచ్చాడు. అయినా సదరు ఉపాధ్యాయుడు సర్వీస్ రిజిస్టర్‌లో ఎవరు రాశారో తెలుసుకుంటానని అనడంతో ఇద్దరి మధ్యా మాట మాట పెరిగింది. అసలు సర్వీస్ రిజిస్టర్‌ను మీరు ఎలా ఫోన్‌లో ఫొటో తీసుకుంటారు? మీకేం సంబంధమని హెచ్ఎం అన్నారు. ఈ క్రమంలో విచక్షణ కోల్పోయిన ఉపాధ్యాయుడు తన కాలికి ఉన్న చెప్పు తీసుకొని దాడి చేసే యత్నం చేశాడు. పక్కనే ఉన్న ఉపాధ్యాయులు అడ్డుకున్నారు. మా పాఠశాలకే వచ్చి మా హెచ్ఎంపై దాడి చేయడం ఏమిటని, అక్కడి నుంచి వెళ్లాలని సూచించారు. దీంతో తన పరువు పోయిందని హెచ్ఎం వెంటనే తోటి ఉపాధ్యాయులతో కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడాడు. ఉపాధ్యాయ సంఘాల ముఖ్య నాయకులు అక్కడికి చేరుకొని హెచ్ఎంపై దాడి చేయడంపట్ల మండిపడ్డారు. ఏదైనా సమస్య ఉంటే కూర్చొని మాట్లాడాలే తప్ప తనది కాని విషయానికి వచ్చి దాడి చేయడం మంచిది కాదని చెప్పారు. మరికొందరు జోక్యం చేసుకొని దాడికి యత్నించిన ఉపాధ్యాయుడి చేత హెచ్ఎంకు క్షమాపణ చెప్పించడంతో గొడవ సద్దుమణిగింది. విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాల్సిన ఉపాధ్యాయుడు పాఠశాల హెచ్ఎం మీద దాడికి దిగడం మంచిది కాదని పలువురు పేర్కొంటున్నారు. కాగా సదరు హెచ్ఎం న్యాయపరంగా వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

రాయలసీమ రేంజ్‌లో 52 మంది సీఐల బదిలీ

కర్నూలు, ఆగస్టు 2: రాయలసీమలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 52 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 20 మందిని వీఆర్‌కు పంపించారు. నంద్యాల డీటీసీలో పనిచేస్తున్న చంద్రబాబు నాయుడును కర్నూలు రూరల్ సీఐగా బదిలీ అయ్యారు. అదేవిధంగా కర్నూలు రూరల్ సీఐ కిరణ్ కుమార్ రెడ్డిని వీఆర్‌కు పంపారు. పాణ్యం సీఐ నల్లప్పను ఆదోని రూరల్‌కు బదిలీ చేయగా ఆదోని సీఐ నిరంజన్ రెడ్డిని వీఆర్‌కు పంపుతూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా

4న మినిస్టీరియర్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

కర్నూలు, ఆగస్టు 2: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియర్ ఉద్యోగుల సంఘం జిల్లా పరిషత్ యూనిట్ ఎన్నికలు 4న నిర్వహించనున్నట్లు యూనిట్ కార్యదర్శి రామచంద్రమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారిగా పసుపల గ్రామ కార్యదర్శి కే. హేమంత్‌కుమార్‌రెడ్డి వ్యవహరిస్తారని అన్నారు. జిల్లా పరిషత్ ఆవరణలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఉదయం నామినేషన్లు, ఉపసంహరణ, జాబితా విడుదల, సాయంత్రం పోలింగ్, అనంతరం కౌంటింగ్ ఉంటుందన్నారు. యూనిట్ పరిధిలో మొత్తం 114 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆస్పరి, ఆగస్టు 2: మండలంలోని చిన్నహోతూరు గ్రామ సమీపంలో నంద్యాల జిల్లా నుంచి కర్ణాటక వెళ్తున్న బొలెరో వాహనం శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురైంది. టైరు పేలడంతో వాహనం బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న వెంకటేశ్వర రెడ్డి (65) అక్కడికక్కడే మృతి చెందగా అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు గాయపడ్డారు. నంద్యాల జిల్లా గోస్పాడు మండలం నెహ్రూ నగర్ నుంచి కర్ణాటకలోని కంప్లి సమీపంలో మారెమ్మ క్యాంపునకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి పార్టీల మధ్య
రగులుతున్న కుంపటి

- నెట్టేకల్లు ఫీల్డ్ అసిస్టెంట్ విషయంలో తలెత్తిన వివాదం


పంట పొలాల్లో ఘర్షణకు దిగిన టీడీపీ, బీజేపీ కార్యకర్తలు

ఆదోని రూరల్, ఆగస్టు 2 : ఆదోని కూటమి పార్టీల మధ్య తలెత్తిన కుంపటి ఆరేలా లేదు. గ్రామంలో ఏదో ఒక విషయంలో నాయకులు ఘర్షణలకు దిగుతున్నారు. గురువారం గణేకల్లు, హనవాళ్, ఇస్వీ పెద్దహరివాణం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో వంట వండే విషయంలో కూటమి నాయకులు విడిపోయి కొట్టుకునే స్థాయికి వచ్చారు. ఇది మరవకముందే శుక్రవారం నెట్టేకల్లులో పండ్లమొక్కలు నాటే కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ కార్యకర్తలు విడిపోయి గొడవలకు దిగారు. సమయానికి పోలీసులు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కూటమి నాయకులు నెల క్రితం శాతాల వారిగా పదవులు పంచుకున్నారు. ఇందులో భాగంగానే టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు నెట్టేకల్లు ఫీల్డ్ అసిస్టెంట్‌గా టీడీపీ కార్యకర్త వీరారెడ్డి పేరును ప్రతిపాదించాడు. దీంతో నెల రోజులుగా వీరారెడ్డి ఉపాధి పనులను పర్యవేక్షిస్తూ వస్తున్నాడు. ఎమ్మెల్యే పార్థసారథి తనకు లెటర్ ఇచ్చాడని, తానే ఫీల్డ్ అసిస్టెంట్‌నని గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కన్నసింగ్ ఉపాధి అధికారులను కలిసి చెప్పాడు. ఇదిలా ఉండగా, గ్రామానికి చెందిన రైతులు గిడ్డయ్య, సుధీర్ సింగ్, నారాయణ సింగ్‌లకు 300 జామ, నిమ్మ తదితర పండ్ల మొక్కలను ఇవ్వడంతో శుక్రవారం వాటిని నాటడానికి ముందుగా వీరారెడ్డి అక్కడికి వెళ్లాడు. ఎమ్మెల్యే తనకు లెటర్ ఇచ్చాడని, తానే ఫీల్డ్ అసిస్టెంట్‌నని బీజేపీ కార్యకర్త కన్నసింగ్ గొడవ దిగడంతో వివాదం తారాస్థాయికి చేరింది. చివరకు ఏపీఓ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి ఇరువురిని అక్కడి నుంచి పంపించారు.

రౌడీషీటర్ దారుణ హత్య

- అయ్యలూరి మెట్ట పొలాల్లో ఘటన ● వేటకొడవళ్లతో దాడి


వెంకటసాయి (ఫైల్)

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 2: నంద్యాల పట్టణానికి చెందిన రౌడీషీటర్ వెంకటసాయి అలియాస్ కవ్వ (30) శుక్రవారం దారుణ హత్యకు గురయ్యాడు. నంద్యాల మండలం అయ్యలూరి మెట్ట పొలాల్లోని ఓ వెంచర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్ళతో అతికిరాతకంగా దాడి చేయడంతో వెంకటసాయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల టౌన్ గుడిపాడిగడ్డకు చెందిన వెంకటసాయి అలియాస్ కవ్వ అనే రౌడీషీటర్ 2022 ఆగస్టు 8వ తేదీన నంద్యాల డీఎస్పీ కార్యాలయంలో పని చేస్తున్న కానిస్టేబుల్ సురేంద్ర హత్య కేసులో మొదటి ముద్దాయిగా ఉన్నాడు. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలలో వెంకటసాయిపై మర్డర్లు, హత్యాయత్నాలు, కిడ్నాప్‌లకు సంబంధించి మొత్తం 21 కేసులు ఉన్నాయి. ఓ కేసులో ముద్దాయిగా ఉంటూ ఇటీవలే కడప సబ్‌జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చాడు. శుక్రవారం వెంకటసాయిని కొంతమంది వ్యక్తులు అయ్యలూరి మెట్ట పొలాల్లోని ఓ వెంచర్‌లోకి పిలుచుకు వచ్చి మద్యం తాగించారు. పథకం ప్రకారం ముందుగా తెచ్చుకున్న వేటకొడవళ్ళతో దాడికి పాల్పడ్డారు. ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు వెంకటసాయి పరుగెత్తుతుండగా వెంటపడి మరి వీపు, మెడపై విచక్షణారహితంగా దాడులు చేసి నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా, డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, తాలూకా పోలీస్ అధికారులు చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. ఇటీవల ఆళ్లగడ్డలో అఖిలప్రియ ఇంటి ఎదుట ఆమె పీఏ నిఖిల్‌పై హత్యాయత్నం కేసులో వెంకటసాయి నిందితుడిగా ఉన్నాడు. ఇదిలా ఉండగా మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు కూడా రౌడీషీటర్‌గా ఉండేవాడు. 27 సంవత్సరాల క్రితం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. మృతుడికి తల్లి లక్ష్మీదేవి, భార్య శైలజ, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు తాలూకా సీఐ దస్తగిరి బాబు తెలిపారు.

ఎయిమ్స్ తరహాలో కర్నూలు జీజీహెచ్‌ను అభివృద్ధి చేయండి
పార్లమెంటులో ఎంపీ నాగరాజు



కర్నూలు రూరల్, ఆగస్టు 2: కర్నూలు ప్రభుత్వ సర్వజన అసుపత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు కోరారు. శుక్రవారం లోక్‌సభలో ఆయన కర్నూలు అసుపత్రిపై ప్రత్యేకంగా మాట్లాడారు. కర్నూలు జిల్లా కరవు ప్రాంతమని, కర్నూలు ప్రభుత్వ అసుపత్రికి దాదాపు 8 జిల్లాల నుంచి వస్తుంటారని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేయాలన్నారు.

డీఐజీని కలిసిన మల్లెల రాజశేఖర్



డీఐజీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఆగస్టు 2: కర్నూలు డీఐజీ కార్యాలయంలో శుక్రవారం కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్‌ను నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పూలబొకే అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతలపై ఇరువురు చర్చించారు. నంద్యాల జిల్లాలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయని మల్లెల రాజశేఖర్‌ను డీఐజీ అడిగి తెలుసుకున్నారు.

స్కూల్ కాంప్లెక్స్ తేదీని మార్చాలి: ఆప్టా

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 2: ఎస్‌సీఈఆర్‌టీ 2024-25 విద్యాసంవత్సరానికి గానూ అకడమిక్ క్యాలెండర్ ద్వారా విడుదల చేసిన స్కూల్ కాంప్లెక్స్ ఆగస్టు 16వ తేదీ కాకుండా ఆగస్టు 19కి మార్చాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు శుక్రవా రం తెలిపారు. ఆగస్టు 16, 17 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ తేదీలను ప్రక టించారన్నారు. ఆగస్టు 16న వరలక్ష్మి వ్రతం ఉందని, మహిళా ఉపాధ్యాయులను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 16న ఆప్షన్ హాలిడేగా ప్రకటించాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ తేదీని ఆగస్టు 16 కాకుండా ఆగస్టు 19కి మార్చాలని వారు మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

ఓర్వకల్లు, ఆగస్టు 2: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం నూతన తహసీల్దార్‌గా వెంకటరమణ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు వీఆర్వోలు ఘనంగా స్వాగతం పలికి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. అలాగే మండలంలోని ముస్లిం మైనార్టీ నాయకుడు ఖాజామియా తహసీల్దార్‌కు పూలబొకే ఇచ్చారు.

ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా గిడ్డయ్య

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 2: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీగా లక్ష్మీపురం జడ్పీస్కూల్‌కు చెందిన గిడ్డయ్య ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో గిడ్డయ్యకు అభినందన సభ జరిగింది. జిల్లా ప్రైవేటు పీఈటీల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, హాకీ కార్యదర్శి సుధీర్, షూటింగ్ పరుశురాముడు, న్యాయవాది శ్రీధర్ రెడ్డిలు గిడ్డయ్యను శాలువలతో సన్మానించారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 2: నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల పెండింగ్ జీతాలు చెల్లించాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం కార్మిక శాఖ కార్యాలయంలో ఉపకమిషనర్ కే.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ డ్రైవర్లకు 7 నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. డ్రైవర్లకు రూ.18 వేలు జీతం, పీఎఫ్, ఈఎస్ఐ ఇస్తామని చెప్పి రెడ్డి ఏజెన్సీ కార్మికుల కడుపు కొట్టిందన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నన్నూరులో చోరీ

రూ.50వేలు అపహరణ


కౌంటరులో డబ్బులు తీసుకుంటున్న గుర్తు తెలియని వ్యక్తి

ఓర్వకల్లు, ఆగస్టు 2: మండలంలోని నన్నూరు గ్రామ బ్రిడ్జి సమీపంలోని అనంతరాముడు చెందిన బుజ్జి కాంప్లెక్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులకొట్టి లోపలికి ప్రవేశించారు. క్యాష్ కౌంటరులో ఉన్న రూ.50వేల నగదును అపహరించుకుని వెళ్లారు. నలుగురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మొహానికి ముసుగులు ధరించి లోపలికి ప్రవేశించారు. లోపల అన్ని పరిసరాలు తనిఖీ చేసి క్యాష్ కౌంటరులో ఉన్న నగదును అపహరించుకుని వెళ్లారు. ఉదయం యజమాని అనంతరాముడు తలుపులు తెరిచి ఉన్న దృశ్యాన్ని చూసి ఓర్వకల్లు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి సీసీ కెమెరాలను పరిశీలించగా.. అందులో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారించారు. అలాగే బంగ్లా సమీపంలో ఉన్న కిరాణం షాపులో తలుపులు పగులకొట్టి రూ.5వేల నగదు, సిగరెట్లను తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంటల నమోదుకు సహకరించండి: ఏవో

కోడుమూరు(రూరల్), ఆగస్టు 2: మండలంలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల నమోదు ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు వ్యవసాయాధికారి రవిప్రకాష్ తెలిపారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది సహకారంతో పొలం వద్ద పంట నమోదు చేసుకోవాలని రైతులను కోరారు. శుక్రవారం కల్లపరి గ్రామంలో పత్తి, కంది పంటలను వ్యవసాయాధికారి పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో రవిప్రకాష్ మాట్లాడుతూ పత్తిలో తెల్లదోమ, పచ్చ దోమల ఉనికి ఉన్నందున ఇమిడాక్లోప్రిడ్, అసిఫేట్ కలిపి పిచికారి చేయాలని సూచిం చారు. గులాబీ పురుగు ఉధృతిని అరికట్టేందుకు పసుపు రంగు జిగురు అట్టలు ఎకరానికి 20 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

హత్య కేసులో నలుగురి అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ

సి.బెళగల్, ఆగస్టు 2: మండలంలోని కొత్తకోట విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల జిల్లా రాజోలి మండల పరిధిలోని పెద్దదన్వాడకు చెందిన శేషిరెడ్డి హత్య చేసిన కేసులో నలుగురు నిందితుల్ని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ మాట్లాడుతూ రాజోలి దగ్గర మకాం వేసి నిందితులు చిన్నారెడ్డి, మహేశ్, తిమ్మారెడ్డి, జనార్దన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. బొలేరో వాహనం, మోటార్‌సైకిల్, హత్యకు ఉపయోగించిన చేతికర్రను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ హత్యకు కారణం అస్తి పంపకాలలో తేడాలు రావడమేనని అన్నారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోండి

కల్లూరు, ఆగస్టు 2: గ్రామీణ ప్రాంతాల్లో డయేరియా, డెంగీ, మలేరియా ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన కల్లూరు మండలం కొంగనపాడులో పర్యటించి శానిటేషన్, తాగునీటి సరఫరా, క్లోరినేషన్, చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. జడ్పీ సీఈఓ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్, సెక్రటరీ, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుల వర్గపోరు


సూపరింటెండెంట్ చాంబరు ఎదుట ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 2: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సెక్యూరిటీ కోసం ఎక్స్‌పర్ట్ ఏజెన్సీలోని కార్మికులు రెండు వర్గాలుగా విడిపోయాయి. ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డులు పని చేయకుండా సమస్యను సృష్టిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో అక్రమాలకు అడ్డాగా మార్చిన సెక్యూరిటీ ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలని, లైంగిక వేధింపులకు పాల్పడిన ఏజెన్సీ ఎస్ఐలను అరెస్టు చేయాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్, సూపరింటెండెంట్ ఆర్డర్స్‌ను లెక్క చేయని ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు ఉదయం కొందరు సెక్యూరిటీ గార్డులు సెక్యూరిటీ ఎస్ఐ ఫిరోజ్ ఖాన్‌ను విధుల్లో తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ చాంబర్ దగ్గరకు వచ్చారు. గురువారం రాత్రి సెక్యూరిటీ ఆఫీసు వద్ద కొందరు ఫొటోలు తీశారంటూ మరో యూనియన్ నాయకులతో వాదనకు దిగారు. తక్షణమే సెక్యూరిటీ ఎస్ఐ ఫిరోజ్‌ఖాన్‌కి డ్యూటీ బాధ్యతలు అప్పగించాలని లేకపోతే విధులకు హాజరయ్యేది లేదంటూ హెచ్చరించారు. రెండు వర్గాలు సూపరింటెండెంట్ చాంబర్ ఎదుట వాదనలు చేసుకోగా పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను శాంతింపజేశారు.

ఆటిజం సమస్యను గుర్తించండి


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 2: చిన్నారుల్లో ఎదుగుదల సమస్యగా మారిన ఆటిజం వ్యాధిని త్వరగా గుర్తించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రకాష్‌నగర్‌లో అంబికా శిశు కేంద్రం ఇన్‌స్టిట్యూట్ డిసిబిలిటీ వర్క్‌షాపు జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రైస్ ఫాతిమాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం అంబికా శిశు కేంద్రంలో అందిస్తున్న సేవలను కొనియాడారు. ఆటిజం కోసం మెడికల్ సర్టిఫికేట్ జారీ చేయడానికి అర్హత కలిగిన వైద్యులతో మెడికల్ బోర్డును ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఆర్‌సీఐ ఆమోదించిన డిప్లమో ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఇంటలెక్చ్యువల్ డిసేబిలిటీ (డీఈసీఎస్ఈ-ఐడీ) పూర్తి చేసుకున్న అభ్యర్థులకు శనివారం ఉదయం 10 గంటలకు జరిగే సదస్సు రెండో రోజులో కన్వొకేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అంబికా శిశుకేంద్రం డైరెక్టర్ బిందుషా తెలిపారు. కార్యక్రమంలో అంబికా శిశు కేంద్రం డైరెక్టర్ బిందు, కృష్ణవేణి, డా.సరోజ, ఆర్య, వీఆర్పీ శైలజారావు, కర్నూలు జీజీహెచ్ మానసిక వ్యాధుల విభాగపు హెచ్‌వోడీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాపుల సంక్షేమానికి తోడ్పాటును అందించండి


టీజీ వెంకటేష్‌ను సన్మానిస్తున్న రోపా ప్రతినిధులు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 2: కాపుల సంక్షేమానికి తోడ్పాటును అందించాలని రోపా ప్రతినిధులు మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్‌ను కోరారు. శుక్రవారం ఆయన కార్యాల యంలో రాయల్ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ (రోపా) కార్యవర్గ సభ్యులు, బలిజ సంఘీయులు మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా కాపు ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కోనేటి చంద్రబాబు, రోపా జిల్లా అధ్యక్షుడు చింతలపల్లి రామకృష్ణ మాట్లాడుతూ ఉచిత బలిజ వివాహ పరిచయ వేదిక ఏర్పాటుకు సహకరించినందుకు టీజీ వెంకటేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా నిలిచిపోయిన కాపు భవనం నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరయ్యేలా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో రోపా సభ్యులు కోనేటి వెంకటేశ్వర్లు, సీవీ శ్రీనివాసులు, డాక్టర్ కొట్టే చెన్నయ్య, గన్నపురెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించండి

ఓర్వకల్లు, ఆగస్టు 2: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న పిలుపునిచ్చారు. శుక్రవారం ఓర్వకల్లులోని ఆర్జీ ఎల్లారెడ్డి జూనియర్ కళాశా లలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 6న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు అనుగుణంగా బస్సు సౌకర్యం, తల్లికి వందనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఓర్వ కల్లు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ధోని, ఉపాధ్యక్షులుగా అనిల్, చైతన్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజు, సహాయ కార్యదర్శిగా మౌలి ప్రసాద్, అమిత్, కోశాధికారిగా శరత్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

పెంపుడు కుక్క అపహరణ

పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు


అపహరణకు గురైన పెంపుడు కుక్క

ఓర్వకల్లు, ఆగస్టు 2: మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఓ ఇంటి పెంపుడు కుక్క అపహరణకు గురి కావడంతో శుక్రవారం బాధితురాలు ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కర్నూలుకు చెందిన నందిని నంద్యాలకు వెళ్తుండగా.. మార్గమధ్యంలో హుశేనాపురం బస్టాండు వద్ద ఉన్న హోటల్ వద్ద ఉన్న పెంపుడు కుక్కను గుర్తు తెలియని వ్యక్తి ఆ పెంపుడు కుక్కను అపహరించుకుని వెళ్లారని బాధితురాలు నందిని తెలిపారు. ఆచూకీ తెలిపినవారికి పారితోషికం కింద రూ.10,016 నగదును అందజేస్తామని ఆ వివరాలు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


కాల్వలను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

కోడుమూరు, ఆగస్టు 2: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని మలేరియా సబ్ యూనిట్ అధికారి రంగస్వామి అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని మురుగు కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటుతో మలేరియా, డెంగీ, మెదడువాపు సంభవిస్తాయని అన్నారు. ఇంటి పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచుకుంటే దోమలను నివారించవచ్చన్నారు. రాత్రి వేళల్లో నిద్రించే సమయంలో దోమ తెరలను వాడాలన్నారు. వైద్య బృంద సభ్యుడు కమాల్ సాహెబ్, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మమ్మ పాల్గొన్నారు.

'డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు చేపట్టాలి'

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 2: విద్యాసంస్థల్లో డ్రగ్స్ నిర్మూలనకు ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి ఇన్‌చార్జి జేసీ మధుసూదనరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ యువత డ్రగ్స్ వాడకం వల్ల తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీనాయుడు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటీ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ: ఎంపీడీవో

సి.బెళగల్, ఆగస్టు 2: మండలంలోని మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి గ్రామ పంచాయతీల్లోని 478 మంది పింఛన్‌దారులకు సిబ్బంది ఇండ్ల దగ్గరికే వెళ్లి పింఛన్లు పంచుతున్నారని ఎంపీడీవో శకుంతల తెలిపారు. బ్రాహ్మణదొడ్డి సచివాలయం దగ్గర పింఛన్ కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారనే వార్తలో నిజం లేదని అన్నారు.

బాధితుల కోసం విరాళాల సేకరణ

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 2: కేరళ రాష్ట్రంలో వాయినాడు జిల్లా లో అకాల వర్షాలతో సర్వసం కోల్పోయిన వరద బాధితుల కోసం నగరంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించినట్లు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం వ్యాపారుల వద్ద విరా ళాలను సేకరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బీసన్న, అధ్యక్షుడు బాబయ్య, నాయకులు చంటి, రాజశేఖర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు


వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారి

కల్లూరు, ఆగస్టు 2: ప్రకృతి వ్యవసాయ విధానాలతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్. వరలక్ష్మి అన్నారు. శుక్రవారం కల్లూరు మండల పరిధిలోని నాయకల్లు, చిన్నటేకూరు గ్రామాల్లో సైంటిస్టులు రాఘవేంద్ర, ఆత్మ డిపిడి శ్రీలత, ఏడీఏ సాలురెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రకృతి వైశాలి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, కన్సల్టెంట్ లక్ష్మయ్య, మండల అధికారితో పర్యటించి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. చిన్నటేకూరు గ్రామంలో బయోచార్ తయారీ చేసుకొని, ఉపయోగించే విధానం గురించి తెలుసుకున్నారు. అనంతరం మల్లె, కంది, మొక్కజొన్న నాయకల్లులో పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించి బాలభాస్కర్ శర్మ సాగు చేస్తున్న క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి, సైంటిస్టులు మాట్లాడుతూ బయోచార్ వాడటం వల్ల నేల భౌతిక రసాయనిక జీవ సంబంధ లక్షణాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి, ఏఈఓ డేవిడ్, మల్లికార్జున, మనోహర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్, జాతీయ పతాకాలు ప్రదర్శిస్తున్న మీసాల సుమలత తదితరులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 2: బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వ ర్యంలో శుక్రవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. కళాశాల సిబ్బంది పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లెక్చరర్లు రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, చిన్న మల్లేశ్వరుడు, ఉల్లోజిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు(కల్చరల్): తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు పింగళి వెంకయ్య అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కొనియాడారు. శుక్రవారం పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా నగరంలోని 48వ వార్డు నేతాజీ సర్కిల్‌లో ఆయన రూపొందించిన జాతీయ పతాకాలను, పింగళి వెంకయ్య చిత్రపటాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ పింగళి వెంకయ్య మన రాష్ట్రంలో జన్మించడం తెలుగు వారందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు మాలిక్‌బాషా, ఖాదర్ బాషా, ఆంజనేయులు, బోయ నాగన్న, వెంకటేశ్వర్లు, నాగప్ప, విశ్వదాభిరామ్, తరణిప్రియ పాల్గొన్నారు.

బియ్యం, కంది పప్పు ధరల తగ్గింపు


ధరల తగ్గింపు పట్టిక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్వో

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 2: రాష్ట్ర పౌర సరఫరాల ఆదేశాల మేరకు బియ్యం, కందిపప్పు ధరలను తగ్గించడం జరిగిందని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, డీఆర్వో మధుసూదన్‌రావు తెలిపారు. శుక్రవారం డీఆర్వో కార్యాలయంలో సరుకుల ధరల తగ్గింపు పట్టిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్టీమ్డ్ రైస్ కేజీ రూ.48, కంది పప్పు కేజీ రూ.150, ముడి బియ్యం కేజీ రూ.47 ప్రత్యేక కౌంటర్ల ద్వారా రైతుబజార్లు, రిటైల్ మార్కెట్‌లో విక్రయిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో ప్రసాద్, ఏఎస్‌వో రామాంజనేయులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో సాగు నీరు ఉపయోగించుకోవాలి


జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

సి.బెళగల్, ఆగస్టు 2: రైతులు ఐకమత్యంతో సాగునీరు ఉపయోగించుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం కొత్తకోట గ్రామం దగ్గర ఎత్తిపోతల పథకం మోటార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తకోట, రేమట, ఉల్చాల, సుంకేసుల, శింగవరం, కొంతలపాడు, బసాపురం గ్రామాల్లోని రైతులు ఐక్యంగా ఉండి ఎత్తిపోతల పథకం నీరు ఉపయోగించుకోవాలన్నారు. ఈ ఎత్తిపోతల పథకం కింద సుమారు 4997 ఎకరాలు పంటలను సాగు చేస్తున్నారన్నారు. ఎల్లెల్సీ అధికారులు డీఈ సుబ్బరాయుడు, ఏఈ దుర్గభవాని, టీడీపీ నాయకులు తిమ్మప్ప, హరి, ధనుంజయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


మాట్లాడుతున్న కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 2: నగరంలో ట్రాఫిక్ రద్దీ, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని నగర పాలక కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. శుక్రవారం నగర పాలక కౌన్సిల్ హాలులో ట్రాఫిక్ సీఐ గౌతమిరెడ్డి, నగర పాలక పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి రోడ్డు సేఫ్టీ సబ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. గత నెల 25న జిల్లా స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షించారు. వాటి అమలుకు తీసుకోవాల్సిన చర్యలు, కలిగే ఆటంకాలకు పరిష్కారాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంఈలు షాకీర్, శేషసాయి, డీసీపీ సంధ్య, ఏసీపీ మంజులత పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై నిరసన


నిరసన తెలుపుతున్న మాల సంఘాల నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శుక్రవారం సిల్వర్ జూబ్లీ కళాశాలలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల సంఘాల జేఏసీ నాయకులు వెంకటేశ్, పి.రాజీవ్ కుమార్, చిటికెల శామేల్ నిర సన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్ తెగల వారి హక్కులను హరించడం భారత రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా సుప్రీం కోర్టు తీర్పును ఇచ్చిందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని కోరారు. నాయకులు, బి.స్వాములు, ఆనందరావు, నాగన్న, నాగరాజు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 2: నగర పాలక సంస్థ ప్రజా ఆరోగ్య విభాగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశా రు. శుక్రవారం కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ వీవీ రామలింగేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసం దర్భంగా మునెప్ప మాట్లాడుతూ 2024 సమ్మెకాలపు వేతనాలు తక్షణమే చెల్లించాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులకు యూనిఫామ్ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూని యన్ జిల్లా కార్యదర్శి పి.మద్దిలేటి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, డిప్యూటీ సెక్రటరీ రామాంజనేయులు, కార్మికులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం


బాల్‌ను బాస్కెట్ రింగ్‌లో వేస్తున్న అతిథులు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 2: స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో శుక్రవారం భూషణ్‌రావు స్మారక బాస్కెట్‌బాల్ పోటీలను డాక్టర్ డబ్ల్యూ.సీతారాం, రిటైర్డు డీఎస్పీ కృష్ణమూర్తి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజ నేయులు హాజరయ్యారు. అంతకుముందు భూషణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ క్రీడలతో దేహదారుఢ్యం క్రమ శిక్షణ, ఏకాగ్రత పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో మురళి, వ్యాయా మ ఉపాధ్యాయులు ముస్తహీద్, ముజాహీద్, కొండేపోగు చిన్న సుంకన్న, ప్రతాప్, నవీన్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అసిస్టెంట్ మృతి

కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన అధికారులు


ఆర్థిక సాయం అందజేస్తున్న సెక్రటరీ

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 2: కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో అసిస్టెంట్‌గా పని చేస్తున్న టి. తిరుపాలు శుక్రవారం మృతి చెందారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు, అసిస్టెంట్ సెక్రటరీ రెహిమాన్, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి తదితరులతో పాటు రాష్ట్ర మార్కెట్ కమిటీల ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్, జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి తదితరులు తిరుపాలు కుటుంబాన్ని పరామర్శించారు. మార్కెట్ కమిటీ తరపున అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ.15వేలు, రాష్ట్ర మార్కెట్ కమిటీల ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ తరపున రూ.10వేల ఆర్థిక సాయాన్ని తిరుపాలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

పెరవలి చెరువుకు నీరు వదలాలి

మద్దికెర, ఆగస్టు 2: మండలంలోని పెరవలి గ్రామంలోని చెరువులకు హంద్రీనీవా ద్వారా నీరు వదలాలని మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు మూలింటి రాము యాదవ్, మాజీ ఎంపీటీసీ పులిశేఖర్ కోరారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలో వారు మాట్లాడుతూ పెరవలి గ్రామ శివారులో హంద్రీనీవా కాలువ వెళ్తుండడంతో వ్యవసాయ తోటల్లో భూగర్భ జలాలు పెరిగి మంచి పంటలు పండుతాయన్నారు. పైపుల ద్వారా చెరువులకు నీరు వదలాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

పచ్చ దోమపై అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, ఆగస్టు 2: మండలంలో ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తిపంటలో పచ్చదోమ అధికంగా ఉందని, దీనిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మండల అధికారి ఉప్పర రవి సూచించారు. శుక్రవారం మండలంలోని మద్దికెర, బీఎన్ పేట గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పచ్చ దోమ నివారణకు 25 రోజుల పంటకు మనోపోట్రోప్రాస్ వాడాలన్నారు. 40 రోజుల పంటకు కూడా తెగుళ్ల నివారించవచ్చని

రూ.2 కోట్ల నిధులు మంజూరు

హలహర్వి, ఆగస్ట్ 2: గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ. 2కోట్ల నిధులు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మల్లికార్జున తెలిపారు. శుక్రవా రం ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్జీఎస్ కింద ఈ నిధులు వచ్చాయని, పంచాయతీల తీర్మానం తీసుకుని అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు.

విద్యా కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ

హలహర్వి, ఆగస్ట్ 2: ప్రభుత్వ పాఠశాలల ఎన్నికలు ఈనెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఈరన్న తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 30 పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులతో నూతన కమిటీ ఎన్నుకోవడం జరుగుతుందని, ఈ ఎన్నికలను ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు నిర్వహించేలా చూస్తామని, ఆరోజు తప్పనిసరిగా విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని నోటిఫికేషన్ జారీ చేశామని చెప్పారు.

హంద్రీనీవా పెండింగ్ పనులు పూర్తి చేయాలి

దేవనకొండ, ఆగస్టు 2 : మండలంలో హంద్రీనీవా పెండింగ్ పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరందించాలని సీపీఐ నాయకులు తహసీల్దార్ జయన్నకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. సీపీఐ జిల్లా నాయకులు మద్దిలేటి శెట్టి, మండల కార్యదర్శి నర్సారావ్ మాట్లాడుతూ మండలంలో 46 వేల హెక్టార్లకు సాగునీరు ఇవాల్సి ఉండగా, ఇంతవరకు పిల్ల కాలువలు పూర్తిస్థాయిలో పనులు జరగలేదన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు వచ్చేలా చూడాలన్నారు. నాయకులు రాజశేకర్, నాగరాజు, రంగన్న, రంగస్వామి, తదితరులు ఉన్నారు.

పత్తికొండ తహసీల్దార్‌గా వెంకటలక్ష్మి

పత్తికొండ, ఆగస్టు 2: పత్తికొండ తహసీల్దార్‌గా వెంకటలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆదోని తహసీల్దార్‌గా పని చేసిన ఈమె ఎన్నికల విధుల్లో భాగంగా చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. తిరిగి ఇప్పుడు పత్తికొండకు వచ్చారు. అంతకుముందు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు.

సార్వత్రిక విద్యకు దరఖాస్తు చేసుకోవాలి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్ట్ 2: సార్వత్రిక విద్య 10, ఇంటర్ (ఓపెన్ స్కూల్) ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ ఉన్నత పాఠశాల సార్వత్రిక విద్య కోఆర్డినేటర్ ఫయాజుద్దీన్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ప్రధనోపాధ్యాయులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 27వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆన్లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 28నుంచి 2 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 9వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పదో తరగతికి బాలికల ప్రవేశానికి రూ.1100, బాలురలకు రూ.1400 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఫీజు చెల్లింపుల్లో రాయితీ ఉంటుందన్నారు. వివరాలకు మున్సిపల్ హైస్కూల్ అధ్యాయానికి కేంద్రంలో సంప్రదించవచ్చని సూచించారు.

సీఐగా బీఏ మంజునాథ్

కోసిగి, ఆగస్టు 2: కోసిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బీఏ మంజునాథ్ శుక్రవారం కోసిగి సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆదోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీల్లో భాగంగా కోసిగి సర్కిల్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసిగి పరిధిలోని కోసిగి కౌతాళం, పెద్దకడుబూరు మండలాల్లో శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. గతంలో కోసిగి సీఐగా పని చేసిన ప్రసాద్ బదిలీల్లో భాగంగా కర్నూలు వీఆర్‌కు వెళ్లారు.

తహసీల్దార్‌గా శివశంకర్ నాయక్

ఆస్పరి, ఆగస్టు 2: ఆస్పరి తహసీల్దార్‌గా శివశంకర్ నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ వీరమ్మ అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

కోసిగి, ఆగస్టు 2: మేజర్ పంచాయతీ కోసిగి మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ ఈవో తిరుమలేశ్వరరెడ్డి, మాణిక్యరాజు తెలిపారు. శుక్రవారం 1, 9 వార్డుల్లోని ప్రభుత్వ ఆసుపత్రి, తదితర కాలనీల్లో డ్రైనేజీలలో బయోఫ్లెక్స్ మస్కిటో యాంటీ లార్వా లిక్విడ్ ద్వారా పిచికారి చేయించారు. కార్యక్రమంలో మాణిక్యరాజు, రాజేష్, దుబ్బ ఈరన్న, థామస్, రాఘవేంద్ర ఉన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి

మద్దికెర, ఆగస్టు 2: మండలంలోని మదనంతపురం గ్రామంలో కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మదనంతపురం శ్రీనివాసులు, టీడీపీ నాయకులు హరినాథ్‌గౌడు, మాజీ ఉప సర్పంచ్ తిమ్మప్ప అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ స్వర్ణలతకు వారు వినతి పత్రం అందజేశారు.

సీఐగా శ్రీనివాస నాయక్

ఆలూరు, ఆగస్ట్ 2: ఆలూరు పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరలో విధులు నిర్వహించిన సీఐ వెంకటేశ్వర్లు వీఆర్‌కు వెళ్లడంతో కడప జిల్లా నుంచి శ్రీనివాస్ నాయక్ బదిలీపై ఆలూరుకు నియామకం అయ్యారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

పత్తికొండ, ఆగస్టు 2: మండలంలో దూదేకొండ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సురేష్, మణి కుటుంబాలకు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. టీడీపీ కార్యాలయంలో మృతుల కుటుంబాలను ఆయన పరామర్శించి మాట్లాడారు. ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు.

మండల సమస్యలు పరిష్కరించాలి

తుగ్గలి, ఆగస్టు 2: మండలాన్ని అభివృద్ధి చేసి సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీ రసూల్ కోరారు. శుక్రవారం పత్తికొండ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. అలాగే తుగ్గలి మండల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్, మాజీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వినోద్ కుమార్ ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

ఆస్పరి, ఆగస్టు 2: మండలంలోని చిగిలి గ్రామ టీడీపీ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ రామచంద్రారెడ్డి (80) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మండలంలో టీడీపీ సీనియర్ నాయకుడిగా పార్టీ సేవలో తన జీవిత కాలాన్ని వెచ్చించడంతో మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్, మాజీ మండల కన్వీనర్లు ఎస్ తిమ్మన్న, శ్రీనివాస్ గౌడ్, ఆయా గ్రామాల పార్టీ నాయకులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

చంద్రబాబు చొరవతోనే ఎస్సీ వర్గీకరణ

ఆలూరు, ఆగస్టు 2: చంద్రబాబు చొరవతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఆలూరు టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ అన్నారు.. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి కేట్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశంలో సీఎం చంద్రబాబు నాయకుడు సానుకూలంగా ఉన్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల ఉప కూలాలకు మేలు జరుగుతుంది అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ, తాలూక అధ్యక్షులు కత్తి రామాంజినేయులు, నాయకులు నరసప్ప, కొమ్ము రామాంజనేయులు, మసాల జగన్, దుర్గ ప్రసాద్, హనుమప్ప, కొమ్ము రాజు, గోవింద్ పాల్గొన్నారు.

● 30 ఏళ్ల నిరీక్షణకు సుప్రీంకోర్టు తీర్పుతో తెర పడిందని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో తాలూ అధ్యక్షుడు కత్తి రామాంజినేయులు, నాయకులు ఏళ్లప్ప, దుర్గ ప్రసాద్, రామలింగ, టీడీపీ నాయకులు నరసప్ప, కొమ్ము రామాంజినేయులు జగన్, బెట్టింగ్ రాజు, పాల్గొన్నారు.

కోసిగి: 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ అంశం ఎన్డీయే కూటమితోనే సాధ్యమైందని ఐటీడీపీ మంత్రాలయం నియోజకవర్గ అధ్యక్షుడు సోల్మాన్ రాజు అన్నారు. శుక్రవారం సోల్మాన్ రాజు మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు మాదిగలంతా రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో కోసిగి ఎంపీటీసీ రాజు, దేవన్న, లింగమూర్తి తదితరులు ఉన్నారు.

● కోసిగి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు సామేల్, నరసింహులు ఆధ్వర్యంలో శుక్రవారం కోసిగిలోని వాల్మీకి సర్కిల్‌లో డా. బీఆర్ అంబేడ్కర్, మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దుర్గప్ప, నాగరాజు, నరసింహులు, హనుమంతు, ఉరుకుందు, రాజు తదితరులు ఉన్నారు.

తుగ్గలి: 30 ఏళ్ల నుంచి ఎస్సీ ఏబీసీడీ పోరాటాలు పటిమకు సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మారెళ్లలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్న అంజి, ఈశ్వరయ్య, గురుమూర్తి, మునిస్వామి, నాగభూషణం, రాకేష్, జయన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు హర్షం వ్యక్తం చేస్తూ జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గర్జి హనుమన్న ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకుని అనంతరం రాముని విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు నివాళులర్పించారు. . కార్యక్రమంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు రత్నం, మణి కుమార్, అనిల్ కుమార్, మారెప్ప, గోపాల్, నాగేంద్ర, హనుమంతప్ప, నరసింహులు, ఈరన్న, ప్రకాష్ పాల్గొన్నారు.

పెద్దకడబూరు: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ నాయకులు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు లక్ష్మన్న,జంపన్న, శాంతిరాజు, బొగ్గుల తిక్కన్న, నరసన్న, రామన్న అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆశన్న, బజారప్ప, ఆదామ్, ఇమ్మానియోల్, రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

వెల్దుర్తి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని ఏపీ ఎమ్మార్పీఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక పాతబస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు, బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో నవీన్, రాముడు, కృష్ణ, దానియేలు, రామ గిడ్డయ్య, పెద్దరంగడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించిందని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమరేష్, తాలుకా అధ్యక్షుడు సుమాల చార్లెస్ పేర్కొన్నారు. శుక్రవారం వర్గీకరణ హక్కును సుప్రీం కోర్టు రాష్ట్రాలకు కల్పించడంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పెద్దయ్య, ప్రకాష్, ప్రభాకర్, దావీదు, నరసన్న, పౌలు, దివాకర్, ప్రకాష్, ఈరన్న, తిమ్మరాజు, భాస్కర్, మధు పాల్గొన్నారు. బైభీం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య, దర్జీ హనుమన్న ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.


ఆలూరు టీడీపీ కార్యాలయంలో వీరభద్ర గౌడ్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


తుగ్గలి మండలం మారెళ్లలో డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


మంత్రాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు


కోసిగిలో అంబేడ్కర్, మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


కేక్ కట్ చేస్తున్న టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, ఎస్సీ సంఘం నాయకులు

ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తాం

పత్తికొండ, ఆగస్టు 2: పత్తికొండ నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందిచడమే లక్ష్యమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం 68చెరువులకు సంబంధించిన అధికారులతో కలిసి ఆయన పైప్‌లైన్, రెగ్యులేటర్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 68చెరువులకు హంద్రీనీవానీటిని నింపాలని అప్పటి డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి సంకల్పించి నివేదిలకు సిద్ధం చేయించడంతోపాటు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించుకుని 65శాతం పనలు పూర్తి చేయడం జరిగిందన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పెండింగ్ పనులు పట్టించుకోలేదన్నారు. పెండింగ్ పనుల పేరిట కోట్ల నిధులుకజేసే గుణం వైసీపీ నేతలదని విమర్శించారు. ఈసీజన్‌లో 68చెరువులకు హంద్రీనీవా నీటినినింపుతామన్నారు. అలాగే నియోజకవర్గపరిదిలో మరో 3మిని రిజర్వాయర్లను నిర్మించేదిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, త్వరలోనే వాటి వివరాలను వెల్లడిస్తామన్నారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల వివరాలను సేకరిస్తున్నామని ఆయా గ్రామాల్లో తాగునీటిసమస్య పరిష్కారం కోసం పనులు చేపడతామన్నారు. ఆయనతో పాటు డీఈ రామక్రిష్ణ, ఏడబ్యూఈ వెంకటేశ్‌నాయక్, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, మనోహర్‌చౌదరి, వెంకటపతి, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.


పత్తికొండ సమీపంలో రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేఈ

మహిళల హక్కుల సాధనకై ఉద్యమించాలి

పత్తికొండ టౌన్, ఆగస్టు 2: సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికమించేందుకు సమిష్టిగా హక్కుల సాధనకై పోరాటాలకు ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిడమ్మ, శ్రావణి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీఆర్ భవన్‌లో మహిళలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మహిళలు హక్కుల సాధనకై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, మహిళా సంఘం నాయకురాళ్లు రంగమ్మ, విజయలక్ష్మి, సుశీలమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

పత్తికొండ టౌన్, ఆగస్టు 2: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల స్నింటినీ తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని పత్తికొండ వ్యవసాయ శాఖ జేడీఏ జే.మోహన్ కుమార్, ఏవో వెంకట్రాముడు రైతులకు తెలియజేశారు. శుక్రవారం పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ఈ-క్రాఫ్ బుకింగ్ కార్యక్రమం చేపట్టగా.. వ్యవసాయ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి ఈక్రాఫ్ బుకింగ్ ఎలా జరుగుతుందో పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రియాజ్‌బాషా, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కేసు జాప్యంపై ఎమ్మెల్యే సీరియస్


ఆదోని, ఆగస్ట్ 2: పట్టణంలో ఓ బాలిక కిడ్నాప్ కేసు నమోదు చేయకుండా పోలీసులు జాప్యం చేయడంపై ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి సీరియస్ అయ్యారు. శుక్రవారం బాధితుల ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించి బాలిక వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనర్ బాలికను ఓ యువకుడు కిడ్నాప్ చేసినా స్పందించకుండా తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులో రెండో పట్టణ పోలీసులు జాప్యం చేయడం వల్ల బాలిక తండ్రి మనస్థాపానికి గురై మృతి చెందడం బాధ కలిగించిందన్నారు. పోలీసులు బాధిత కుటుంబానికి అండగా ఉండాల్సింది పోయి నిర్లక్ష్యం చేయడం ఏంటని డీఎస్పీ, సీఐలపై మండిపడ్డారు. వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేయాలని సూచించారు. కుటుంబానికి అండగా ఉంటానని అన్యాయం చేయకుండా బాధితులపై చర్యలు తీసుకునేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


బాలిక తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారధి

ఫొటో2వైఎంజీ1. సుదర్శన్‌రెడ్డి, పట్టణ సీఐ, ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు సీఐగా సుదర్శన్‌రెడ్డి

ఎమ్మిగనూరు, ఆగస్టు2: ఎమ్మిగనూరు పట్టణ సీఐగా బి.సుదర్శన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా స్థానికంగా విధులు నిర్వహిస్తున్న మధుసుదన్ కర్నూలు వీఆర్‌కు బదిలీకాగా ఆయన స్థానంలో ప్రభుత్వం సుదర్శన్‌రెడ్డిని నియమించింది. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ఇన్‌చార్జ్ డీఎస్పీ శివనారాయణస్వామిని మర్యాద పూర్వకంగా కలిశారు.



ఉద్యమాలకు సిద్ధం కావాలి

ఆదోని (అగ్రికల్చర్) ఆగస్ట్ 2: కార్మిక చట్టాల అమలు కోసం కార్మికులంతా ఐక్యతతో ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజినేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు పీఎస్ గోపాల్ అధ్యక్షతన జరిగింది. అంగన్వాడీ, ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా పీఎఫ్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఉపాధ్యక్షులు ఈరన్న, రామాంజనేయులు, మహానంద్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, రాముడు, గోపాల్, నాగరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

చాతుర్మాస దీక్షలు చేపట్టిన పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 2: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తన 12వ చాతుర్మాస దీక్షను శుక్రవారం స్వీకరించారు. మంత్రాలయంలోనే చాతుర్మాసదీక్షలు చేపట్టాలని మఠం దివాన్ సుజీంద్రాచార్, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషీలు ఆహ్వానం పలికారు. వారి పిలుపు మేరకు పూర్ణబోధ పూజామందిరంలో మూలరాములకు పూజలు చేసి దీక్షలు స్వీకరించారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి, మూలరాములకు పూజలు చేసి హారతులు ఇచ్చారు. ఈ నెల 2 నుంచి సెప్టెంబరు 18 వరకు పీఠాధిపతి దీక్షల్లో ఉంటారని, దాదాపు 48 రోజులు ఈ దీక్షల్లో ఉన్నంత కాలం మంత్రాలయం సరిహద్దులు దాటకుండా మంత్రాలయంలోనే భక్తులకు అందుబాటులో ఉంటూ పూజలు చేస్తుంటారని మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు.


చాతుర్మాస దీక్షలకు పీఠాధిపతికి ఆహ్వానం పలుకుతున్న మఠం అధికారులు

కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 2: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చే విద్యార్థులంతా పేద విద్యార్థులని, మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కళాశాలలో ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కళాశాల అధ్యక్షులుగా బాబు, ఉపాధ్యక్షులుగా ఎర్రిస్వామి, వీరేష్, నాని, అంజనేయులు, కార్యదర్శిగా శంకర్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, కార్తీక్, వీరాంజనేయులు, ఉపేంద్ర, కోశాధికారిగా రాజశేఖర్ లతో పాటు 30 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రంగస్వామి, సమీఉల్లా, ఖాదర్, దస్తగిరి, శంకర్‌లు పాల్గొన్నారు.

ఉత్సవాల ఏర్పాట్లు వేగవంతం చేయాలి

కౌతాళం, ఆగస్టు 2: ఈ నెల 4నుంచి ప్రారంభమవుతున్న ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాసపు ఉత్సవాల ఏర్పాట్లు వేగవంతం చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ ఈఓ, ఆలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు మరో రెండు రోజులే మిగిలి ఉండగా భక్తులకు కల్పించాల్సిన కనీస అవసరాల ఏర్పాట్లు కూడా పూర్తి స్థాయిలో లేకపోవడంతో కొంత అసహనం వ్యక్తం చేశారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఎల్ఎల్‌సీ కాలువ వద్ద పుణ్యస్నానాలు చేస్తారని అక్కడ ప్రత్యేక స్నానపు గదులు ఉండేలా చూడాలన్నారు. మహిళా భక్తులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, భక్తులు వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి సూచించారు. సబ్‌కలెక్టర్ వెంట ఆలయ ఈఓ వెంకటేష్, ఆలయ అర్చక సిబ్బంది ఈరప్ప స్వామి, ఆలయ సిబ్బంది ఉన్నారు.


వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై ఎస్ఐకి సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్

పిచ్చి కుక్క స్వైర విహారం

పది మందికి గాయాలు

మద్దికెర, ఆగస్టు 2: మండలంలోని మదనంతపురం గ్రామంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారంలో పది మంది గాయపడి పత్తికొండ ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స కోసం వెళ్లారు. గ్రామానికి చెందిన భార్గవ్ రామ్, గుంత లక్ష్మీదేవి, కురువ సమంత, లక్ష్మితో పాటు మరో ఆరుగురిని పిచ్చికుక్క కరిచింది. కురువ సమంత అనే చిన్నారి తలకు, కాళ్లు చేతులకు గాయాలయ్యాయి. అంతేగాక గ్రామంలో పశువులపైన కూడా దాడి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. బసినేపల్లి, పెరవలి హెల్త్ సెంటర్లలో కుక్క కాటుకు మందు లేకపోవడంతో పత్తికొండకు వెళ్లి నాటు వైద్యం చేయించుకున్నారు.

పంట నమోదు చేసుకోవాలి

గోనెగండ్ల, ఆగస్టు 2: ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసుకున్న ప్రతి రైతు తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి మల్లికార్జున కోరారు. శుక్రవారం గోనెగండ్లలోని ఎంపీడీవో సమావేశం భవనం నందు మండల లోని రైతు సేవా కేంద్రం సహాయకులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులకు కలిగే లాభాలను వారికి వివరించాలని, గ్రామాలలో ఉన్న రైతులు రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జిలు కలసి పంట నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీ బాలుర హాస్టల్ ఏర్పాటు చేయాలి

గోనెగండ్ల, ఆగస్టు 2: గోనెగండ్లలో బీసీ బాలుర హాస్టల్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిఉదయ్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు ఖాజా డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నూతన మండల కమిటీ ఎన్నిక: మడల శాఖ అధ్యక్షుడిగా పవన్‌తేజ, కార్యదర్శిగా రంగస్వామి, మండల కార్యవర్గ సభ్యులుగా అన్నమయ్య, అరవింద, హుసేని, వినయ్, రియాజ్, నరేంద్ర, ఓంకార్ ఎన్నికయ్యారు.

భూ తగాదాలో తమ్ముడిపై అన్న దాడి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 2: భూమి తగాదా విషయంలో తమ్ముడిపై అన్న దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అన్నదమ్ములు రంగస్వామి, పెద్దయ్యలకు గత కొంతకాలంగా భూమి పంపకం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం పెద్దయ్య పొలంలో మిరప నార వేసేందుకు ద్విచక్ర వాహనంపై మిరపనారను పెట్టుకొని పొలానికి వెళ్తున్నాడు. పొలానికి వెళ్లే మార్గమధ్యంలో ఉన్న వంకలో ఉన్న రంగస్వామి, లక్ష్మీనారాయణ ద్విచక్రవాహనంపై ఉన్న పెద్దయ్యపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. భార్య యల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: టీడీపీ

తుగ్గలి, ఆగస్టు 2: కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, సీనియర్ నాయకులు వెంకటస్వామి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వెంకట్రాముడు చౌదరి, అన్నారు. శుక్రవారం రాంపురం చెందిన సీనియర్ టీడీపీ నాయకులు రఫీ, అల్లీపీరాల తల్లి పింజరి లాలెమ్మ (74) మృతి చెందడంతో ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు భీమలింగప్ప చౌదరి, మద్దిలేటి చౌదరి, మాజీ సర్పంచ్ చంద్రన్న, మల్లయ్య, పక్కీరప్ప తదితరులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

ఆదోని రూరల్ ఆగస్టు 2 : ఆదోని మండలం గణేకల్లు ప్రభుత్వ పాఠశాలను సబ్ కలెక్టర్ శివ నారాయణశర్మ శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకుల వల్ల విద్యార్థులు ఇంకొక్కసారి పస్తులుంటే సహించే ప్రసక్తే లేదని ఎంఈవో, ఉపాధ్యాయులపై సబ్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఏజెన్సీ నిర్వాహకులు వివాదం సద్దిమణిగే వరకు పిల్లలకు హెచ్‌ఎం నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈవోకు సబ్ కలెక్టర్ సూచించారు. అనంతరం విద్యార్థులకు అందించే భోజనాన్ని రుచి చూడడంతో పాటు విద్యార్థుల చదువులపై ఆరా తీశారు. పాఠశాల 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ అయ్యిందని, కాబట్టి నూతన స్థలం లో ప్రభుత్వ పాఠశాలను నిర్మించాలని గ్రామస్థులు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సబ్‌కలెక్టర్ వెంట డీఎల్‌డీవో నాగేశ్వరరావు, ఎంపీడీవో శేఖర్, ఎంఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ్ ఉన్నారు.

1.5 కేజీల కణితి తొలగింపు

ఎమ్మిగనూరు, ఆగస్టు 2: గోనెగండ్ల మండలం బైలుప్పల గ్రామానికి చెందిన కేశవరం సర్వసతి కడుపులో నుంచి 1.5 కేజీల కణితిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు తొలగించారు. బైలుప్పల గ్రామానికి చెందిన సర్వసతిని తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మున్నారం గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్‌తో వివాహం జరిపించారు. అయితే సర్వసతి ప్రసవం కోసం పుట్టింటికి వచ్చింది. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకరాగా పరీక్షించిన వైద్యులు సర్వస్వతి కడుపులో శిశువుతో పాటు కణితి ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆపరేషన్ చేసి కణతిని తొలంచారు. సర్వసతి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 2: ప్రభుత్వ పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం వడ్డించే విధంగా చూడాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధానాపురం ఉదయ్ కోరారు. శుక్రవారం మండగిరి పరిధిలోని ఆర్టీనగర్ ఉన్నత పాఠవాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రఘు, వినీల్, రాజేష్, వీరభద్ర పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

మంత్రాలయం, ఆగస్టు 2: మంత్రాలయంలోని బీసీ హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థోమాస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఇనచార్జి తహసీల్దార్ రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు.